క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

రావికమతం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో డీఈఈ జి.సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. రావికమతం సబ్ స్టేషన్ మెయింటనెన్స్, అప్‌గ్రేడ్ మరమ్మతులు చేస్తున్న కారణంగా ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను అందజేస్తున్న శ్రీనివాస్

కె.కోటపాడు: హిందూ ధర్మ ప్రచారం కార్యక్రమంలో భాగంగా త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు అనకాపల్లి కమిటీ ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గవరపాలెంలో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలతోపాటు ప్రజలకు త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు దేవి, రేవతి, మణి, పద్మ, అక్షయ్, కుమార్, స్వరదార, అశోక్ పాల్గొన్నారు.

మోదమాంబ కాలనీకి సీసీ డ్రైనేజీ



సీసీ డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మాడుగుల: స్థానిక మోదమాంబ కాలనీలో సీసీ డ్రైనేజీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఏళ్లుగా సీసీ డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపై మురుగు నిల్వలు ఉండేవి. దీంతో రోడ్డు మీద తిరగాలంటే ఇబ్బంది ఉండేదని కాలనీ వాసులు చెబుతున్నారు. సీసీ డ్రైనేజీలు ఏర్పాటు వల్ల తమ కష్టాలు తీరనున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రాక

కె.కోటపాడు: సూదివలసలో భూదేవి చెరువు ప్రాంతాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం పరిశీలించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో శంకుస్థాపన చేశారన్నారు. ఆనాటి నుంచి ఈ పనులు చేయకపోవడంతో సంబంధిత ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలిస్తారన్నారు.

సామాజిక రాజకీయ విప్లవానికి నాంది

నర్సీపట్నం: సామాజిక రాజకీయ విప్లవానికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 స్థానాలను బీసీ అభ్యర్థులకు కేటాయించడం హర్షణీయమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల మహిళలకు రాజకీయ పదవుల్లో పెద్దపీట వేశారని కొనియాడారు. సామాజిక వర్గాల సాధికారతకు సీఎం బాటలు వేస్తున్నారన్నారు.

మంచినీటి బోరును బాగు చేయరూ..



మంచినీటి బోరు

బుచ్చెయ్యపేట: వడ్డాది ఆర్అండ్‌బీ కస్పా రోడ్డు పక్కన మంచినీటి బోరు మరమ్మతులకు గురైంది. బొడ్డేరు గౌరినాయుడు పాకల వద్ద ఈ బోరు హెడ్ కింద భాగం తొడుగు తుప్పు పట్టి ఊడిపోయింది. దాంతో నీళ్లు పట్టుకునే అవకాశం లేక పలువురు అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులతోపాటు కస్పా పొలాలకు వెళ్లే రైతులు, పశువుల కాపర్లు ఈ బోరు నీరుతో దాహం తీర్చుకునేవారు. వేసవి దృష్టిలో పెట్టుకుని తక్షణమే బాగు చేయాలని రైతులు బొడ్డేటి అప్పలనాయుడు, రాములమ్మ, సయ్యపురెడ్డి తాతలు తదితర్లు కోరుతున్నారు.

రోడ్డుపైనే మార్కెట్...



ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్న వాహనాలు



రోడ్డుపైనే కూరగాయల క్రయ విక్రయాలు

- తరచూ ట్రాఫిక్ అంతరాయం
- పాత స్థలంలో మార్కెట్ తరలించేందుకు చర్యలు

నర్సీపట్నం: పట్టణంలోని చింతపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌తో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. కొనుగోలుదారులు, రైతులతో మెయిన్ రోడ్డు రద్దీగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ వలయంలో నుంచి బయటపడటానికి వాహనదారులు గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

కరోనా ప్రభావంతో అధికారులు నర్సీపట్నం నడిబొడ్డు అబిద్‌సెంటర్‌లో ఇందిరా మార్కెట్‌ను మూడేళ్ల క్రితం చింతపల్లి రోడ్డు పీనారపాలెం వద్దకు తరలించారు. ఇందిరా మార్కెట్‌లోని వ్యాపారులు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. చిరు దుకాణాలు సైతం వెలిశాయి. మున్సిపాలిటీలోని 75 వేల మంది, పరిసర మండలాల నుంచి వేల మంది ప్రజలకు ఈ మార్కెట్ పెద్ద దిక్కుగా ఉంది. నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, కోటవురట్ల రోలుగుంట మండలాల రైతులు కూరగాయలను మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముతుంటారు. రోజూ కొనుగోలుదారులు, వ్యాపారులతో మార్కెట్ రద్దీగా ఉంటోంది. మంగళ, శనివారాల్లో కిటకిటలాడుతోంది. ఖాళీ స్థలం లేక రైతులు తీసుకువచ్చిన కూరగాయలు రోడ్డుపైనే క్రయ, విక్రయాలు చేస్తున్నారు. చిల్లర దుకాణాలు, తాత్కాలిక దుకాణాలు రోడ్డు మీదకు ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ అంతరాయం వల్ల 400 మీటర్ల రోడ్డు దాటడానికి సుమారు గంటన్నర సమయం పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. పోలీసు, మున్సిపల్ అధికారులు దృష్టిసారించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో జయమాధవిని సంప్రదించగా, అప్పటి పరిస్థితుల దృష్ట్యా మార్కెట్ మార్చామన్నారు. త్వరలోనే యథావిధిగా ఇందిరా మార్కెట్‌లోకి దుకాణాలను మార్పు చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

హోరాహోరీగా ఎడ్లబళ్ల పరుగు పందెం



వడ్డాదిలో మోదకొండమ్మకు భక్తుల పూజలు



బుచ్చెయ్యపేటలో ఉరకలేస్తున్న ఎడ్లు

బుచ్చెయ్యపేట: వడ్డాది, బుచ్చెయ్యపేటలో తీర్థాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుచ్చెయ్యపేటలో ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గులు, క్విజ్, కబడ్డీ, ఎడ్ల పరుగు పందెం ఆకట్టుకున్నాయి. ప్రధానంగా ఎడ్లబళ్ల పరుగు పందెం హోరాహోరీగా సాగింది. ఆయా పోటీల్లో విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు బహుమతులను ప్రదానం చేశారు. వడ్డాదిలో మూడు రోజుల పాటు జరిగే మోదకొండమ్మ తీర్థం సందర్భంగా తొలిరోజు అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాల భక్తులు తీర్థంలో పాల్గొన్నారు. రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

27 వరకు ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశం

రోలుగుంట: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సహదేవుడు మంగళవారం తెలిపారు. గతంలో పదో తరగతి ఉత్తీర్ణత చెందిన వారికి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువు మధ్యలో ఆపేసిన వారికి ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు ఫీజులు ఆన్‌లైన్లో గాని, నేరుగా తమ కళాశాలలో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9985593881 సంప్రదించాలని సూచించారు.

పాడి రైతులకు అవగాహన

చీడికాడ: పశు విజ్ఞాన బడి ద్వారా పాడి పరిశ్రమపై రైతుల్లో అవగాహన వస్తుందని చీడికాడ పశువైద్యాధికారి జి.గాయిత్రీదేవి తెలిపారు. పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని దిబ్బపాలెం, దండిసురవరం గ్రామాల్లో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, అత్యవసర చికిత్సలు, వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డాక్టరు వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

ర్యాగింగ్ నిర్మూలనకు ప్రత్యేక టీమ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గణేష్

నర్సీపట్నం: కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనకు కమిటీలు సమర్థవంతంగా పని చేయాలని టౌన్ సీఐ ఎస్.గణేష్ అన్నారు. టౌన్ పోలీసు స్టేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలోని 30 కళాశాలల్లో యాంటీర్యాగింగ్ నిర్మూలనకు ఒక్కొక్క కాలేజీకి సీనియర్ ఫ్యాకల్టీ, సత్ప్రవర్తన కలిగిన ఇద్దరు విద్యార్థులతో కమిటీలను వేశామన్నారు. ప్రతి కాలేజీలో పోలీసు కంప్లైట్ బాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ర్యాగింగ్ సమస్యను ఎదుర్కొంటే కాగితంపై రాసి అందులో వేస్తే పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదుదారు వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ మధ్యకాలంలో కొంత మంది విద్యార్థులు గంజాయి రవాణాతోపాటు సేవిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్తే జీవితాలు నాశమవుతాయన్నారు. టౌన్ ఎస్సై గోవిందరావు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు : సీఐ

చోడవరం రూరల్: కళాశాలల్లో తమ జూనియర్ విద్యార్థులను, సహ విద్యార్థులను ర్యాగింగ్ చేసినట్టయితే కఠిన చర్యలు తప్పవని సీఐ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులతో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా చోడవరం స్టేషన్ పరిధిలోని 16 కళాశాలల్లో సీనియర్ ఫ్యాకల్టీ, మంచి నడవడిక కలిగిన ఇద్దరు విద్యార్థులు, ఒక పోలీసు ఆఫీసర్‌తో యాంటీ ర్యాగింగ్ కమిటీలను నియమించారు. చోడవరం ఎస్‌ఐ బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

కుళ్లిన కోడిగుడ్లపై ఆందోళన

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కుళ్లిన కోడిగుడ్లు పెట్టడంతో వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకుని వంట నిర్వాహకులను హెచ్ఎం అప్పారావు హెచ్చరించారు. ఏ విద్యార్థికైనా కుళ్లిన గుడ్డు పెడితే, వెంటనే దాన్ని పక్కన పెట్టి మరొక గుడ్డు ఇస్తున్నామన్నారు. ఇటువంటివి తినకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకట్రావు

మాడుగుల రూరల్: గ్రంథాలయాలకు నూతనంగా సమకూర్చిన పుస్తకాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సిహెచ్. వెంకట్రావు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మాడుగుల శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయానికి కొత్తగా 650 పుస్తకాలు వచ్చాయన్నారు. రోజూ ఎంత మంది పాఠకులు వస్తున్నారని గ్రంథపాలకుడు యడ్ల వెంకటేశ్వర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ సిబ్బంది వి.శృతి పాల్గొన్నారు.

డీఈవోకు అభినందన

అనకాపల్లిటౌన్ : విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలు ప్రధాన భూమిక పోషించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యా లయంలో మంగళవారం యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి డీఈవోను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షుడు ఎన్.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి, కార్యదర్శి జి.ఎస్.ప్రకాష్, మండల నాయకులు దేవుడునాయుడు, ఎస్.నూకరాజు, కె.కామరాజు, రమేష్, రవి, శ్రీను, స్వామి, అలివేలు, అజయ్, రేఖ, అరుణ, తేజ, వర్ధన్ పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్ విజయానికి కృషి చేయాలి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

రావికమతం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి అంతా గట్టిగా కృషి చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ ప్రతినిధులతో మంగళవారం ఆయన రావికమతంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీరు వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల ఇంటికే నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వీటిని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారన్నారు. త్వరలో జరగనున్న శాసన మండలి ఎన్నికలో మన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించేందుకు ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను చైతన్యవంతం చేయాలన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, మూడు మండలాల సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో సుధాకర్‌ను గెలిపించాలి

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



గునుపూడి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. మండలంలోని పి.జగ్గంపేట, పి.కె.గూడెం, గునుపూడి, చినగొలుగొండపేట, పెదగొలుగొండపేట, వెదురుపల్లి, సరుగుడు, కె.వి. శరభవరం, గుమ్మడిగొండ పంచాయతీల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నాడు -నేడు నిధులతో అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిపారన్నారు. వీటిని గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు ఐక్యతగా పని చేసి నర్సీపట్నం నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ ఇవ్వాలన్నారు. దానికి తగట్టుగా ప్రణాళిక రూపొందించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, గన్నవరం, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, వేముల సూర్యనారాయణ, మిరపల వెంకటరమణ, కాళ్ల సత్యనారాయణ, అంకంరెడ్డి నూకాలమ్మ, గుడపర్తి సీతయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యులు గాడి దేవి, పోలుపర్తి వెంకటరమణ తమరాన సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, ఏఎంసీ డైరెక్టర్లు బండి గంగరాజు, ఎ. నాయుడు, మాజీ సర్పంచ్ పోలుపర్తి చిట్టిబ్బాయి పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జితో పార్టీకి నష్టం

నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కర్రి నాగమణి

మాడుగుల రూరల్: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.జి. కుమార్ ఒంటెద్దు పోకడల వల్ల పార్టీ మనుగడకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కర్రి నాగమణి ఆరోపించారు. మంగళవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి కె.జె.పురంలో మాట్లాడారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలు గురించి సీనియర్ నేతలకు కనీసం సమాచారం ఇవ్వకుండా గ్రామాల్లో పర్యటించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఎంతో కాలం నుంచి పార్టీలో కష్టపడి పనిచేసే వారిని గుర్తించకుండా ఆయన తన సొంత కేడర్‌తో కార్యకలాపాలు సాగించడం తగదన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు రాపేట జోగినాయుడు, నాయకులు శరగడం ఆదిబాబు, యల్లపు రాము(రెబల్), ఎ.వి.వి. ఆదినారాయణ, చిన్నం దాలిబాబు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్య సేవలు



పోన్నవోలులో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం



బోయిలకింతాడలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి గోవిందరెడ్డి

దేవరాపల్లి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారి జి. గోవిందరెడ్డి అన్నారు. ఈ మేరకు వేచలం పీహెచ్‌సీ పరిధి బోయిలకింతాడలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇక్కడ దీర్ఘకాలిక రోగుల ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోవపోన్నవోలులో..

మాడుగుల రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా మంగళవారం లోవపోన్నవోలులో వైద్య సేవలందించారు. కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ఎం.నాయుడు, 104 వైద్యాధికారి సురేష్‌కుమార్ సంయుక్తంగా 65 మందిని పరీక్షించారు. బీపీ, సుగర్, వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య పర్యవేక్షకులు హేమలత, జి.ప్రసాద్, ఎం.ఎల్‌హెచ్.పి యమున, ఏఎన్ఎం మంగతాయారు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వేతో రైతులకు మేలు

మాకవరపాలెం: జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. మంగళవారం గిడుతూరులో చేపట్టిన డ్రోన్ సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ సర్వేతో రైతుల సమస్యలు పరిష్కారం కావడంతోపాటు శాశ్వత భూ హక్కు కలుగుతుందన్నారు. ఇప్పటికే ఎనిమిది గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, నాయకులు పెట్ల భద్రాచలం, మూకల బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-చలానాలు చెల్లించని వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్.ఐ ధనుంజయ్

కె.కోటపాడు: వాహనదారులు ప్రయాణ సమయాల్లో తగిన భద్రత పాటించాలని కె.కోటపాడు, ఎ.కోడూరు ఎస్‌ఐలు ఆర్.ధనుంజయ్, బి.రామకృష్ణ తెలిపారు. గతంలో విధించిన అపరాధ రుసుమును చెల్లించని వాహనాలను మంగళవారం కె.కోటపాడులో ఎస్‌ఐ ధనుంజయ్, ఆనందపురంలో ఎస్‌ఐ బి.రామకృష్ణ తనిఖీలు చేశారు. పెండింగ్ అపరాధ రుసుము మీసేవా కేంద్రాల్లోను లేదా ఆన్‌లైన్ పేమెంట్ విధానంలో చెల్లించాలని వాహనాల యజమానులకు సూచించారు. అదేవిధంగా ప్రయాణ సమయంలో పరిమిత వేగంతోపాటు హెల్మెట్, సీటు బెల్టు తప్పకుండా ధరించాలన్నారు.

మాతృభాషను ఎల్లవేళలా గౌరవించుకోవాలి



విద్యార్థులకు బహుమతి ప్రదానం



హాజరైన విద్యార్థులు



మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చోడవరం రూరల్: భావవ్యక్తీకరణ కోసం వాడబడుతున్న మన మాతృభాష తెలుగును ఎల్లవేళలా గౌరవించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ కోరారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల విద్యార్థులతో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సి.కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాంతాల వారీగా వేర్వేరు భాషలు పుట్టుకొచ్చాయన్నారు. ఎవరి భాష వారికి తల్లి లాంటిదని, అలాంటి మాతృభాషను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ మేరకు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. వివిధ భాషా విభాగాధిపతులైన ఉపన్యాసకులు బి.లక్ష్మి, ఆర్.రాణి, ఎస్ మల్లిబాబులను సత్కరించారు. ఎన్ఎస్ఎస్ పీవో డి.మాల్యాద్రి, ఇతర విభాగాధిపతులు జి.వి.వి.ఎస్ ప్రసాద్ బాబు, ఎస్.ఎం.రఫుద్దీన్, టి.రాధాకృష్ణ, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

రావికమతం: మాతృభాషా దినోత్సవాన్ని టి.అర్జాపురం పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం కె.ఆర్.ఎస్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎవ్వరెవ్వరు ఎటువంటి ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఉన్నా మాతృభాష తెలుగును మర్చిపోవద్దన్నారు. సీఆర్పీ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూతదశలో రబీ వేరుశనగ

కె.కోటపాడు: మెట్ట ప్రాంత గ్రామాల్లో రబీ వేరుశనగ పంట పూతదశకు చేరుకుంది. స్వల్ప కాలవ్యవధి పంట కావడంతోపాటు లాభదాయకంగా ఉండటంతో రైతులు అధికంగా సాగు చేశారు. మండలంలో చిరికివానిపాలెం, ఆర్.వై.అగ్రహారం, ఉగ్గినవలస, ఆనందపురం, వారాడ, కొత్త అగ్రహారం, గుల్లేపల్లి, గరుగుబిల్లి గ్రామాల్లో 80 హెక్టార్లలో పండిస్తున్నారు. పలు గ్రామాల్లో ఈ పంట ప్రస్తుతం పూతదశకు చేరుకుంది. ఈ సమయంలో ఎకరానికి 200 కేజీల జిప్సం వేయడం వల్ల పంటలో నూనె శాతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు.



చిరికివానిపాలెంలో వేరుశనగ పంట